మిసెస్ వి. కే. వటీరావు, యమ్మే

[లేడీస్ కల్చర్ క్లబ్]

చింతా దీక్షితులు

[ఈ కథలో సంస్థలూ పాత్రలూ కల్పితములు. దేనినీ ఎవరినీ ఉద్దేశించినవి కావు.]

ఈమధ్య నాభార్య నాతో బహు అన్యోన్యంగా ఉండడం మొదలెట్టింది. సాధారణంగా తన చీరలేమిటో, తన బ్లౌసులేమిటో, తనఆభరణాలేమిటో, తన అలంకరణాలేమిటో, తన క్లబ్బేమిటో అదేగొడవగాని, భర్త అనే మగవాడిని నేనొక్కణ్ణి ఉన్నాననీ, నాకూ, తనకూ విచ్ఛిత్తిగాని ప్రేమ ఆ జన్మమూ ఉండాలనీ మరిచిపోయేది. హోటల్నించి భోజనం తెప్పించుకొని మేముద్దరమూ మూగనోముపట్టి భోంచేశేవాళ్ళము. తక్షణమే ఆవిడ క్లబ్బుకు సింగారించుకు వెళ్లిపోయేది. నేను కచేరీకి పరుగెత్తుకు పోయేవాణ్ణి.

పిల్లలు వేరే కాన్వెంటు స్కూలులో చదువుకొంటున్నారు కాబట్టి వాళ్లగొడవ నాకూ మా ఆవిడకూ కూడా పట్టేది కాదు. ఎప్పుడైనా పిల్లలు యింటికి తిరిగి వస్తే నన్ను అసలే మరిచిపోయేది మాఆవిడ. వాళ్లచేత యింగ్లీషు పద్యాలూ పాటలూ పాడించడం, వాళ్ళచేత యింగ్లీషు ఆటలు ఆడించడం, వాళ్లతోపాటు తనూ గంతులెయ్యడం, స్కిప్ చెయ్యడం, డాన్సుచెయ్యడం- ఇదీ పొద్దస్తమానమూను. సాయంత్రం వాళ్లను యింగ్లీషు దుస్తులతో అలంకరించి, వాళ్ళకు హ్యాట్లుపెట్టి, తనూ అలంకరించుకొని క్లబ్బుకు తీసుకుపోయేది. నిజంచెప్పాలి కాబట్టి చెప్తున్నాను—నా భార్యమాత్రం యింగ్లీషు దుస్తులు ధరించేదిగాదు. హ్యాట్ పెట్టేదికాదు. రోజు కోరకం చీర కట్టుకొని, బాహుమూలరుచుల కద్దురాని రవిక తొడుక్కొని, ఒక చేతికే రెండు బంగారుగాజులు పెట్టుకొని, రెండోచేతికి రిష్టువాచీ కట్టుకొని క్లబ్బుకు వెడుతూండేది.

ఒకమాటు అన్నానుగదా హాస్యానికి—"పోనీ నువ్వు కల్చర్డులేడీవిగదా; యమ్మేప్యాసయ్యావు; లేడీస్ కల్చర్ క్లబ్బులో సభ్యురాలవు, బైసికిల్ తొక్కగలవు కూడాను—ఈ చీరలూ, రవికలూ ఖర్మం ఏమిటీ? స్కర్టుతొడుక్కొని హ్యాట్ పెట్టుకొని యింగ్లీషు స్త్రీలలాగ.... ...." వాక్యం పూర్తిగాకముందే నన్ను గట్టిగా ఛెళ్లున చెంపమీద కొట్టి "మీరు సూటువేసినపుడు నేను కడతానులెండి స్కర్టు" అంటూ నిప్పులు గ్రక్కుతూ లేచిపోయింది.

చెంపకాయ తిని ఊరుకొన్నాను. ఊరుకోక చేశే దేమిటి— యమ్మే ప్యాసైనకామిని సహధర్మచారిణి అయినప్పుడు? ఇంటిగుట్టు రట్టు చేసుకోవచ్చునా? ఇంతకీ హిందూ స్త్రీ ధర్మానికి వ్యతిరేకంగా స్కర్టు హ్యాట్టుల ధరించుకోమని చెప్పడం నాదే తప్పు!

సాధారణంగా ఈవిధంగా ఉండే నాభార్య నాయెడల ఎక్కువ అన్యోన్యంగా ఉండడమూ, నాతో ఎక్కువకాలం గడపడమూ, నాతో అదేమాటలు చెప్పడమూ, అదేపరిహాసాలు చెయ్యడమూ, అదేకథలు చెప్పడమూ, నన్ను దువ్వడమూ లాలించడమూ— యిదంతా తమాషాగా తోచింది. ఏమిటిచెప్మా కారణం అనుకొన్నాను. ఏమీస్ఫురించింది కాదు.

కాని ఒకసంగతి జ్ఞాపకం వచ్చింది. నిరుడు కొంచెంహెచ్చుతగ్గుగా యీ విధంగానే నాతో అన్యోన్యంగా ఉండేది. నా పూర్వాచారపరాయణత్వాన్ని మెచ్చుకొనేది. చివరకు నాచేత వేషంవేయించి, నన్ను నలుగురు ఆడవాళ్ళలోనూ దవ్వపాలు చేసి, భర్తను ఫూల్ని చెయ్యడంలో అగ్రగణ్య అనే పేరు సంపాదించి, అందుకుగాను క్లబ్ యిచ్చే బహుమానాన్ని సంపాదించింది. నిజానికి కొంతతప్పు నాదికూడాను. వేషం వెయ్యడానికి పూనుకొన్నది నేనే. నాభార్య నన్ను పురిగొల్పి నాకు సహాయంచేసింది— దుర్బుద్ధితోనైతేనేమీ? అంతేకాకుండా తనతోపాటు నాకూ బహుమతులు తెచ్చి

పెట్టింది. అయిందేమిటో అయింది. ఇక యీ యేడు మళ్లీ ఆవిధంగానే చెయ్యాదుకద? ప్రతీసంవత్సరం కొత్త కొత్త విషయాలికి క్లబ్బువాళ్లు ప్రైజులిస్తారు కాని ప్రతీయేడూ భర్తలను భార్యలు ఫూల్సుగా చేసినందుకే ప్రైజు లిస్తారనడం అసంభవంగదా! కాబట్టి ఆదురుద్దేశం నాభార్యకు లేకపోవచ్చును. మరి వేరే విషయం యేదైనా ఉంటుందా?

లేడీస్ కల్చరు క్లబ్బువారు ప్రతీయేడూ డిశంబరులో బహుమతులిస్తారు. డిశంబరు యింకా మూడు నెల్లు ఉంది. నాభార్య నన్ను లాలించడం అప్పుడే మొదలు పెట్టింది. నాకు బహుమతిగా వచ్చిన నటరాజ విగ్రహాన్ని తనూ పూజించడం మొదలు పెట్టింది. గోడలమీది సినీమాబొమ్మలు తీసివేసి దేవుళ్ళ బొమ్మలు తగిలించింది. రోజూ నాచొక్కాలకు బొత్తాలు పెట్టిపెడుతోంది. ఊడిపోయిన బొత్తాలు కుట్టిపెడుతోంది. పంచెలు మరమ్మతు చేస్తోంది. వద్దంటే వినక నా కప్పుడప్పుడు వాసననూనెలూ, అత్తరువులూ రాస్తోంది. ఒకమాటు బలవంతాన్ని నామొహం అంతా ఫేసు పౌడర్ పామింది వద్దంటూంటే! సబ్బుతో కడుక్కొని ఆఫీసుకు ఆలస్యంగా వెళ్లి చివాట్లు కూడా తినవలసి వచ్చిందప్పుడు.

ఒకవేళ నాభార్యకు హూకారం హెచ్చిందేమో నామీద— ఒకవేళ బుద్ధి తిరిగిందేమో. చదువుకొన్నది; హిందూదేశంలో పుట్టినది; విద్యాదోషంవల్ల కొంతవరకు బుద్ధి కొంతకాలం పరదేశపుదారిని పట్టినా క్రమేణా సర్దుకొంటూన్నదేమో?

ఏమైనా యీయేడు బహుజాగ్రత్తగా ఉండాలని దృఢసంకల్పం చేసుకొన్నాను. నాభార్య ఎంతహూకారం చూపినా, ఎంత చాకచక్యంతో నడుచుకొన్నా, ఎంత పూర్వాచారాభిమానం నటించినా నేను చలించదలుచుకోలేదు. రాతి బొమ్మకు చక్కిలిగింతలు పెట్టగలుగుతుందేమో చూద్దాము!

ఈమార్పు తనలో ఎందుకుకలగాలో నాభార్యనే అడిగితే బాగుంటుందేమో ననిపించింది. చదువుకొన్న లేడీతో వ్యవహారంగవా తీరా అడిగితే తనను ఇన్సల్టుచేశానని విసిరికొడుతుందేమో? అడక్కపోతే నన్ను మళ్లీ ఫూల్ని చేస్తుందేమో? ఏమైనానరే ఎందుకైనా మంచిదని నిశ్చయించి నాభార్యతో యీవిషయాన్నిగురించి పూర్తిగా చర్చించడానికి తీర్మానించుకొన్నాను. మా ఉభయులకూ తీరుబడిగాఉన్న ఒకరోజున నాభార్యను పిలిచాను. "వటీ! నీవిలువమైన కాలంలో కొన్ని నిముషాలు నాకొరకు వినియోగించగలవా?" అన్నాను యింగ్లీషుతో. నాభార్యపేరు అసలు కళావతమ్మ, అది క్రమక్రమంగా కళావతి, వతిగా మారింది. ప్రస్తుతం వాడుకలో ఉన్న పేరు "మిసెస్ వతీరావు" లేక "వటీరావు" ఈచివర "రావు" నాపేరు. ఇంగ్లీషులో మాత్రమే పేరుచదివేవారు నాభార్యను మిసెస్ వటీరావు అనిగాని, మిసెస్ వాటీరావు అనిగాని పిలుస్తారు. మొగుడిపేరు తమపేళ్ళ చివర తగిలించుకోవడంలోనే ఇంగ్లీషు చదువుకొన్న ఆడాళ్ల అస్వతంత్రత కనబడుతోందని ఒకమాటు నేను దెప్పిపొడిచాను. అది అస్వతంత్రత కాదనీ, పేరు ఒక ప్రత్యేకతకు సూచనగా మాత్రమే వినియోగిస్తుందనీ, మొగుడిపేరు వంటరిగా వదిలివేస్తే దిక్కుమాలినదై పోతుందని దయదలిచి తమపేరుతో జోడిస్తున్నామనీ, అందుకు కృతజ్ఞత చూపక దెప్పిపొడవడం మగవాళ్ల నీచత్వానికి నిదర్శనమనీ చెప్పి మళ్లీ నన్ను కిక్కురుమనకుండా చేసింది.

"అయితే కళా, యీయేడు మీక్లబ్బులో బహుమతు లివ్వడంకద్దా?" అని అడిగాను. "మళ్లీ మీకు బహుమానం పొందాలని ఉందా ఏమిటి పాపం— మా అమ్మో, నాకంటిపాపే."

"నాకు బహుమానం కావాలని కాదు, వటీ; నీకు బహుమానం వస్తే నాకు వచ్చినట్లు కాదూ?"

"ఆఁ'' మరే, పాపం— నాబహుమానం మీరు కొట్టెయ్యాలనుకుంటున్నారు గాబోలు—"

"అది కాదు, వటీ!"

"పోనీ కావలిస్తే తీసుకోండి పాపం మాటవరసకి నాకీయేడు ఒకచీర, ఒకబ్లౌసూ బహుమానం యిచ్చారనుకుందాం. మీరంత సరదాపడుతూంటే మీకుకాదని నేనుమాత్రం వాటిని వాడతానా ఏమిటి? మీరే తీసుకోండి.''

"యూ, సిల్లీ; అందుకుకాదు నేను అడుగుతూంట. అసలు సంగతి తెలుసుకోడానికి.''

"సంవత్సరోత్సవాలు ఉన్నప్పుడు బహుమతులే ఉండవూ? ఆమాత్రం నాడార్లింగుకు తెలిసిందికాదుకాని."

"అయితే కిందటి యేడులాగ ఈయేడేమైనా కోతిపనులు చేస్తావా?"

అనగానే నామీసం పట్టుకులాగుతూ "అంత మరపేమిటి మీకు, డియర్ హాబ్బీ? కోతిపనులు మీరా, నేనా చేస్త? మీ తెలివి తేటలవల్లనేగా నాకూ మీకూ బహుమానం వచ్చిందీ!''

మీసం వదిలించుకొని అన్నాను గదా "చూడు కళా, ఈ యేడుగానీ నన్ను అలాంటి కోతిపనుల్లో కలుపుకున్నావంటేమాటదక్కదుసుమా."

"నోఫియర్ మైడియర్."

"అయితే, వటీ, అసలు సంగతేమిటి? ఈయేడు ఎందుకని బహుమతులిస్తారు?'' అన్నాను సంగతి తేల్చుకోడానికి.

నాభార్య అనుమానించి, నాకేసి పరకాయించి చూచింది. నాముఖమూ, చెవులూ, జుట్టూ తనచేతులతో దువ్వుతూ అన్నది:

"అనుమానం పట్టుకుంది కాబోలు కాదూ మీకు?''

"కాదు, డార్లింగ్!''

"అవును, పీచ్!''

"కా దంటూంటే!''

"అయితే చెప్పడానికి వీల్లేదు!''

"ఏమిటీ?''

"బహుమతు లెందు కిస్తారో చెప్పడానికి వీల్లేదు — క్లబ్బురూల్సు పాటించనక్కరలేదంటారా ఏమిటి?"

"చెప్పకూడ దని క్లబ్బురూల్సా?''

"అవును, మైపెట్!''

"డియర్ హాబ్బీకికూడా చెప్పకూడదా, రోజ్?''

"సారీ, హాబ్బీ.''

"పోనీ ఆగోడవ నా కక్కరలేదు గాని— నామీదకు మాత్రం రాకేం, ఓల్డుగరల్!''

"మీచేత వేషం వేయించనులెండి.''

"సరే, నాజాగ్రత్తలో నేనుంటాలే!''

"ఆల్ రైట్, మై డియర్!''

"కళా, ఇంకో ప్రశ్న అడగాలని ఉంది; అడగనా?''

"రైటో; అడగండి.''

"ఈమధ్య నీకు నామీదా, నా అభిప్రాయాలమీదా కొత్తగా అభిమానంకలిగింది.ఏంచాత నంటావు?"

ఈప్రశ్న నేనడగడంతోనే నాభార్య కోపం నటించింది. తటాలున లేచి వెళ్లిపోబోయింది. గుమ్మందాకా వెళ్లి మళ్లీ తిరిగివచ్చి, గభాలున నావళ్లో కూచుని నాబుగ్గలురెండూ గట్టిగా సాగదీసింది. నామీసాలు గుంజింది. గట్టిగా కంఠాన్ని ఆశ్లేషించి "ఇంకెప్పుడూ అడగరుగదా అలాంటి పశ్న, అడగరుగదా, అడగరుగదా!'' అంటూ నాచెంపలు మృదువుగా ప్రేమతో వాయించింది.

'నాప్రశ్నలోతప్పేమిటి?''అన్నాను.

"తప్పేమిటా, తప్పేమిటా'' అని నన్ను బుజాలుపట్టి ఊగిస్తూ,

"నన్ను అనుమానిస్తారా యింత డర్టీగా? నాప్రియమైన భర్తమీద నాకెప్పుడు అభిమానంలేదు? నాకను పాప అభిప్రాయాలమీద నాకెప్పుడు అభిమానం లేదు? క్రొత్తగా అభిమానం పుట్టిం దంటారా? మీన్!'' అని మొహం చిట్లించింది. నాఅభిప్రాయానికి ఆధారాలు లేకపోలేదు. కాని అవి అన్నీ నేను చెప్పితే నా భార్య చిన్నబుచ్చుకో వచ్చు, లేదా కోపగించవచ్చు ననుకొని, తనకుమాత్రం ఆలోచిస్తే తెలియదా ఏమిటి అనుకొని ఊరుకొన్నాను.

* * *

పర్యవసానం ఏమీతేల్లేదు. ఎందుకు బహుమతు లిస్తారో రహస్యంగా ఉంచుకొన్నారు. నాచేత వేషం వేయించ ననిమాత్రం నాభార్య చెప్పింది. వెయ్యమంటే మాత్రం వేస్తానా! కాబట్టి అది చెప్పి లాభం లేదు. ఏవిధంగానైనా నన్ను మోసగిస్తుందేమో అని నా జాగ్రత్తలో నేనున్నాను. నాభార్యను కనిపెడుతున్నాను. ఒకనాడు నే నింట్లో ఉండగా నాభార్య ఒకపెద్దమనిషిని తీసుకొనివచ్చింది. అతగాడు యింగ్లీషు దుస్తులు వేసుకొన్నాడు. చేతులో ఈవినింగ్ హాట్ ఉంది. మీసం ముక్కుకింద మాత్రమే ఉంది. పడుచువాడు.

సాధారణంగా ఎవళ్లనైనా కొత్తవాళ్లను యింటికి తీసుకువచ్చినప్పుడు నాభార్య నాకు వాళ్లని ఎరుకచేసేది. ఇన్‌ట్రడ్యూసు చెయ్యకుండా ఎప్పుడూ ఉండలేదు. ఇప్పుడు మాత్రం ఆనల్లదొర ఎవరో నాతో చెప్పలేదు. నేను ఫలానా అని అతడితోనూ చెప్పలేదు.

వచ్చీరావడంతోనే ఇద్దరూ రెండు కుర్చీలలో కూలబడ్డారు. నాభార్య తనచేతిసంచీ బల్లమీద పెట్టింది. దానిమీద అతడు తనహాట్ పడవేశాడు. కాఫీ ముందర బెట్టుకొని బిస్కత్తులు తింటూ వాళ్లు ఇంగ్లీషున అదేకబుర్లు చెప్పుకోవడం మొదలుపెట్టారు.

పక్కగదిలోకి వెళ్లి నేను పనిచూచుకొంటున్నాను. ఉండుండీ ఇద్దరూ

విరగబడి నవ్వుతున్నారు. చప్పట్లు కొడుతున్నారు. బల్ల గుద్దుతున్నారు. చేతులతో తొడలు తట్టుకొంటున్నారు. ఎందుకో అంతకులాసా నాకు బోధపడిందికాదు.

ఆ మొద్దుముండాకొడు కెవరో నా కాఫీ అంతా తాగేస్తూ, నాబిస్కత్తులన్నీ మింగేస్తూ, నా కుర్చీలూ బల్లలూ విరగ్గొడుతూ, నాభార్యతో అంతజోస్తీగా మాట్లాడుతూ, నవ్వుతూ, నాయింట్లో యింతహంగామా చేస్తూన్నందుకు నాకు కోపం వచ్చింది. కాని ఏమిచేసేది. ఏమైనా కలగజేసుకొంటినా చదువుకొన్న భార్యతో వ్యవహారం పెద్దపులితో చెలగాటంవంటిది.

కాని ఒకటుంది. నాభార్య అనేక పట్టణాల్లో కాలేజీలల్లో చదువుకొన్నది కాబట్టి అనేకమంది స్నేహితులు ఆవిడ కున్నారు. ఆడవాళ్లల్లోనూ ఉన్నారు. మగవాళ్లల్లోనూ ఉన్నారు. బహుశా యీ మనిషి మగమిత్రులలో ఒకడు కావచ్చు. పాత స్నేహితుడు కావచ్చు. చాలాకాలానికి వాళ్లు కలుసుకొని ఉండవచ్చు. అందువల్ల ఈఉత్సాహమంతా అయి ఉండవచ్చు. లేదా అతడు నాభార్య దూరబంధువు కావచ్చు. నాభార్య దూరబంధువుల నందరినీ నేను ఎరిగి ఉండనుగదా! ఒకమాటు చూచిపోదామని వచ్చి ఉండవచ్చు. దూరబంధువే అయితే నేనుకూడా కొంతమట్టుకు బంధువునేగదా! మరి నన్ను కలుసుకోలేదేమి?

లేదా ఒకవేళ వాళ్లక్లబ్ మెంబర్ల తాలూకుమనిషై ఉండవచ్చు. ఏమెంబరుభర్తో, అన్నో, తమ్ముడో అయియుండవచ్చు. ఆ మెంబరు ద్వారా నాభార్యతో పరిచయం కలిగించుకొని ఉండవచ్చు. ఎందుకు తొందరపడడం? తెలుస్తుందిగదా!

కొంతసేపటికి సద్దణిగింది. నాగదికేసి వస్తారేమో, నాకు అతనితో పరిచయం కలిగిస్తుందేమో అని ఆశతో సులోచనాలు సర్దుకొని సీరియస్‌గా బింకంగా కూర్చున్నాను... ఎవరూవస్తూన్న జాడలేదు. నిరుత్సాహంతో లేచి చూతునుగదా——నాభార్య ఆ ముక్కుకింద మీసాలవాడూ కలిసి కబుర్లు చెప్పుకొంటూ నవ్వుకొంటూ వీధమ్మట నడిచి వెడుతున్నారు!

* * *

రెండు మూడురోజులదాకా నాభార్యతో నేను సంప్రతించడానికి వీలు కలిగిందికాదు. నా పనులతొందర, ఆవిడకి క్లబ్బుతొందర, స్నేహితులతో పరిచయాలతొందర—— ఇన్ని కారణాలు——

ఈ రెండు మూడు రోజులలోనూ ఎన్నోవిశేషాలు కూడాను. ఒకనాడు నేను కచేరీపని పూర్తిచేసుకొని షికారుగా సముద్రతీరానికి వెళ్లాను. హాయిగా గాలి వీస్తోంది. సముద్రపు అలలు నాపాదాలదగ్గిరికి వచ్చి ఆడుకొంటున్నాయి. సముద్రం నాహృదయంలాగే లేచి పడుతోంది. సూర్యుడు సముద్రంలో అస్తమించబోతున్నాడు. కడుపులో చెయ్యిపెట్టి కడిగివేస్తూన్న బెంగలు మరిచిపోయి, సంధ్యావందనం సంగతి కూడా మరిచిపోయి ఆసీలి సముద్రంకేసీ, ఆ ఎర్రసూర్య బింబంకేసీ చూస్తూ సంజవెలుగులో మునిగి ఉన్నాను.

కొంతసేపైనతర్వాత తల పక్కకి తిప్పి చూచాను. ఒక పురుషుడూ ఒక స్త్రీ మాట్లాడుకొంటూ వస్తున్నారు. కొంతసేపటికి పోలిక గట్టగలిగాను. ఆపురుషుడు ముక్కుకింద మీసంవాడు; ఆస్త్రీ నాభార్యా! అలలు మరిచాను, సముద్రం మరిచాను, సంజ మరిచాను, అంధకారంలో పడ్డాను. దగ్గిరికి వస్తారుగదా ఏవిధంగా యీ కుట్ర పరిణమిస్తుందో చూతామని వాళ్లను చూడనట్టు నటిస్తూ అక్కడే నిలబడ్డాను.

నాభార్య నన్నుచూచింది కాబోలు దారి మళ్లించి అడ్డదారిని అతణ్ణి తీసుకువెడుతోంది. ఆ మసకచీకట్లో వాళ్లనవ్వులు వినిపిస్తున్నాయి. కనిపెట్టి చూస్తున్నాను. వాళ్లు మోటారుకారుదగ్గిరికి వెళ్లారు. కారు ఎక్కారు. కారు బయలుదేరుతోంది లేదు. బయలుదేరడం లేదు. ఎందుచేతనో, పదినిముషాలైంది. నేను చూడనేలేదు సముద్రపు ఒడ్డునుంచే వెళ్లింది ఒకపడుచమ్మాయి. కారు సమీపించింది; ఆమె కారు ఎక్కింది. కారు కదలి వెళ్లిపోయింది.

ఎవరో ఆ అమ్మాయి? ఎంతక్షోభపడిందిమనస్సు నిష్కారణంగా అనుకొంటూ ఇంటిమార్గం పట్టాను.

ఇంకోమాటు కచేరీపని కావడంతోనే కల్చరు క్లబ్బు పక్కనుంచి వెడదామని బుద్ధిపుట్టింది. నాభార్య కనిపిస్తుందేమో, ఏమిచేస్తూ ఉంటుందో గేటుయివతలినుంచే చూడవచ్చు ననుకొన్నాను. మనస్సు మహాపాడువస్తువ. ఎంత సమాధాన

పెట్టినా వినదు. ఇంటికి పోనియ్యకుండా ఎందుకు ఈ క్లబ్బువైపుకు ఈడ్చుకురావాలి? ఏదైనా ఫలానా కార్యంకోసమని తీసుకువస్తే బాగుంటుంది. ఏమీ లేదే! ఈ మనస్సు అడుగు పొరల్లో ఏదో అనుమానం దాన్ని శల్యంలాగ బాధిస్తోంది. ఆ అనుమానాన్ని దృఢపరుచుకోడానికో, రద్దుచేసుకోడానికో ఈ ప్రయత్నమంతాను. ఎవరి మీద అనుమానం? నాభార్య మీదనే? నాభార్య గడుసుదంటే ఒప్పుకొంటాను; పెంకెదంటే ఒప్పుకొంటాను, మాటకారి అంటే ఒప్పుకొంటాను చెయ్యిచేసుకొనే స్వభావంకలదంటే ఒప్పుకొంటాను.—కాని యిన్నాళ్లు నిష్కళంకంగా నాతో కాపురంచేసి, మాయిద్దరికీ సంతానంకూడా కలిగినతరువాత యింకా అనుమానమా? మనస్సు మహాచెడ్డవస్తువ!

క్లబ్బుపక్కనుంచి అటూఇటూ తిరిగాను. గేటులోంచి చూచాను నాభార్య కనబడలేదు. ఇంతలో గేటుదగ్గిర జవాను నన్ను చూచి వచ్చి నమస్కరించి అన్నాడు "బాబయ్యా, యీయేల అమ్మొగోరు కబ్బుకు రానేదు. ఆరెవరో, పెద్దింటోరే బాబయ్యా, ఆలుమగళ్లు దెబ్బలాడుకొన్నారంట – సంసారం గాదా బాబయ్యా; అమ్మొగోరు ఆమొగాయన్ని యెంటబెట్టుకు ఎల్లిపోయేరంట." మాయామర్మం ఎరగని వాడిమాటలు విని నామనస్సు చివుక్కుమంది. వెంటబెట్టుకు వెళ్లడమంటే ఏమిటి? చెప్పరానిమాటైతే వాడు నాతో చెప్తాడా? చెప్పగూడిన మాటైతే వెంటబెట్టుకు వెళ్లడమంటే ఏమిటి? వెధవ అనుమానం బాధిస్తూనే ఉంది ఎందుకు అనుమానం?

ఇంటికి వచ్చినవాణ్ణి నాకు చూపక పోవడం ఒకటి; బీచిదగ్గిర తప్పించుకు పోవడం రెండు; మొగాయన్ని వెంటబెట్టుకు వెళ్లడం మూడు. సరే, కానీ అడిగి చూస్తాను!

నాభార్య ఈసంగతు లన్నీ నిలవేసి అడగా లని నిశ్చయించాను. సంజాయిషీ ఏమియిస్తుందో చూడాలని నిశ్చయించాను. కాని ఆవిడ ఎడమొహం పెడమొహంగా తిరుగుతోంది. నాతో సమావేశం కాకుండా ఉండాలని ప్రయత్నిస్తోంది. నేను ఎప్పుడైనా పిలిచినా, ఏమైనా అడిగినా "ఇప్పుడుగాదు, తీరుబడి లేదు; సారీ" అంటోంది. నాభార్య ప్రవర్తనలో, కళ్లల్లో, చేష్టల్లో మార్పు కనిపిస్తోంది. చూడమని నామనస్సు నాకు బోధిస్తోంది. ఇలాఉండగా నాకో ఉత్తరంవచ్చింది. నాశ్రేయోభిలాషి వ్రాసింది. పేరు లేదు ఊరులేదు. అందులో విషయాలు ఏమి టంట— "మీరు బహు ఉత్తములు. విద్యావతిని వివాహమాడి ధన్యులైనారు. ఇంతవరకూ కళంకం లేకుండా మీ సంసారం జరిగింది. మీమేలు కోరినవాడను కాబట్టి చెప్పుతున్నాను. మీభార్య ప్రవర్తన అనుమానాస్పదంగా ఉన్నది. నిరంతరమూ చాటూ మాటూ లేకుండా ఒక జెంటిల్ మానుతో తిరగడం మా బోటివారికి చాలావిచారంగావుంది. మీరు తగుశ్రద్ధ వహించాలి. సంసారులముగదా! వ్యవహారము ఖాత్తరుచుకోవాలిగాని పాడుచేసుకోకూడదు. సెలవు."

ఇంకేముంది. అనుకున్నంతా జరిగింది. ఏమిటి చెయ్యడమిప్పుడు? వ్యవహారం ఖాత్తరచుకో వాలిట! అలాగే వుంటుంది పరాయివాళ్లకి. తనదాకా వచ్చేదాకా తెలియదు.

మతి పోతోంది. ఉత్తరం మళ్లీ చదివాను. ఆదస్తూరీ ఏదో ఎరిగిఉన్నట్లే ఉంది. ఎవరో నామిత్రులలో బంధువులో వ్రాసిఉంటారు. ఉత్తరం జాగ్రత్తచేశాను. కర్తవ్య మేమిటో మాత్రం తెలియడంలేదు. డైవోర్సు బిల్లేనా పెట్టారుగారు.

కార్పణ్యంతో తిరుగు తున్నాను. నా భార్యముఖంకేసేనా చూడ్డం లేదు. మాయిద్దరికీ కొన్నాళ్లు మాటలుకూడా లేకపోయాయి. ఏమి చెయ్యాలో నిర్ణయించి తరవాత దండిద్దా మని ఆలోచిస్తున్నాను. డిశంబరునెల గడిచిపోతోంది.

ఒకనాడు నాభార్య గంతులతో, నవ్వులతో ఒక పెద్దతోలుట్రంకు పట్టుకొని నాదగ్గర కొచ్చింది. నేనామెముఖం చూడలేదు.

"ఏంచేస్తున్నారు, మైడియర్" అంది. నాకు వళ్లుమండుతోంది. అసహ్యంగా నాభార్యమొహంకేసి చూచాను. ఇంతా చేసి సిగ్గూ బిడియం లేకుండా యీవిధంగా నాదగ్గర కొస్తుందా! కానీ.

"కోపంవచ్చిందా. మైలవ్" అన్నది. నాకు అసహ్యం. కోపం ఎక్కువౌతున్నాయి. తొందరపడి ఏంచేసి పోతానోఅని నాలో నాకే భయంగా వుంది.

"మైడియర్—నన్ను క్షమించరూ?"

"నీప్రవర్తన ఏమీబాగాలేదు. పిల్లలగన్నదానవు—బుద్ధిలేదూ? సిగ్గూ

బిడియం లేదూ? ఏ మొహం పెట్టుకు నాదగ్గిరకొచ్చావు— అవతలికి ఫో" అన్నాను.

ఈమాటలు వినడంతోనే మానమున్న భార్యఅయితే బయటికి వెళ్లిపోయి గదిలో కూర్చుని ఏడుస్తుంది. నాభార్య—అప్పుడప్పుడు నేను తిట్టినప్పుడు— ఆవిధంగానే చేసేది. ఇప్పుడుకూడా అలాగే చేస్తుం దనుకొన్నాను. చెయ్యలేదు సరిగదా విరగబడి నవ్వడం మొదలుపెట్టింది. చప్పట్లుకొట్టి గిర్రునతిరుగుతూ నవ్వుతోంది. ఈప్రవర్తన నా కర్థం కాలేదు. నవ్వి నవ్వి నా ఒళ్లోకి వచ్చి కూచుని నాచేతులు గట్టిగా పట్టుకొంది. చేతులు వదిలించుకొని కిందకు తోసెయ్యా లనుకొన్నాను. నిదానించాను. అప్పుడంది నాభార్య "మీమనస్సుకు చాలా నొప్పికలిగించాను, నాకు తెలుసును; రెండు నెలలపాటుమిమ్మల్ని బాధపెట్టాను; నే నెరుగుదును. నేనుమాత్రం బాధపడడంలేదా ఏమిటి? పైకి నవ్వుతున్నానుగాని మనస్సులో ఎంత ఏడుస్తున్నాను నన్ను క్షమించరూ? నన్ను క్షమించరూ?" అంటూ నా చేతులు వదిలిపెట్టి కళ్లమీద చేతులు పెట్టుకొని ఏడవడం మొదలెట్టింది. నాకు జాలివేసింది. కాని మనస్సు కఠినంగానే ఉండమంటోంది. అన్నా నాభార్య చీరకొంగుతోదాని కన్నీళ్లు తుడిచివేసి, కళ్లముందర నుంచి చేతులుతీసి "ఏమిటిదంతా" అన్నాను.

"నన్ను క్షమించండి. చెయ్యక తప్పిందికాదు" అన్నది.

"సరే నేనడిగిన ప్రశ్నకుసమాధానం చెప్పు" అనిపించింది నా మనస్సు.

నాభార్య మాట్లాడలేదు.

"ఎవ రారెణ్ణెల్లక్రితం మనింటికి వచ్చిన పెద్దమనిషి? వాడిని నాకెందుకు యిన్‌ట్రడ్యూసు చేశావుకావు? వాడితో నవ్వులు నవ్వకొంటూ పోక నాదగ్గిర కెందుకొచ్చావు? వాడితో సముద్రపొడ్డున పికార్లు కొట్టుకో నీయిష్టం వచ్చినట్లు! ఆలూమగళ్లు దెబ్బలాడుకొంటే, అదేసమయ మని మగాణ్ణి వెంటవేసుకు వెళ్లు— నాదగ్గిర కెందుకు వచ్చావు?" అన్నాను కోపధోరణితో.

"వినండి, వినండి, అంతా చెబతాను. తొందరపడకండి." అన్నది నాభార్య నా వళ్లోనుంచి లేవనెత్తి పక్క కుర్చీలో కూచోబెట్టి చెప్పమన్నాను. నాభార్య యీవిధంగా చెప్పింది.

"మాక్లబ్బులో ఒకమ్మాయి ఉంది. ఆవిడకు పెళ్లయి యింకా సంవత్సరమేనా దాటలేదు. వట్టి తెలివితక్కువపిల్ల. ఆమొగుడేనా సర్దుకుపోయేవాడేమో ననుకొంటే అతడు కోపదారి. అందువల్ల వాళ్లిద్దరికీ అన్యోన్యం చెడింది. ఇద్దరూ విడిపోయి ఒకనెల్లాళ్లు కాలక్షేపం చేశారు. ఎన్నాళ్లు అలాగ ఉండగలరు? తాననిచెప్పి ఆపిల్ల మొగుణ్ణి రమ్మనదు. అంత అభిమానం ఆవిడికి. అతగాడు మగాడుగదా సర్దుకోకూడదా అంటే అతనికీ తగనిగర్వం. కాబట్టి మధ్యవర్తులద్వారా వాళ్ల వ్యవహారం ఫాక్తు పరచవలసి వచ్చింది.

మాక్లబ్బులో ఒకనియమ మేమిటంటే— మాలో ఎవరికి ఏ ఆపద వచ్చినా క్లబ్బుమెంబర్లు కలగజేసుకొని సహాయం చేస్తారు. ఈ విషయమై ఒకసభచేసి ఏకగ్రీవంగా నన్ను మధ్యవర్తిత్వం నడిపించమన్నారు. క్లబ్బు తీర్మానానికి అనుగుణంగా నే నతన్ని పిలిపించి నెల్లాళ్లు అతనితో పోరి భార్యతో సమాధానపడడానికి వప్పించాను.

ఆపిల్లదగ్గిరికి వెళ్లి చెప్పవలసిన విధంగా చెప్పి సమాధానపరిచాను. వాళ్లిద్దరూ కలుసుకొని రెండురోజులే అయింది."

"అయితే అతన్ని మనింటికి తీసుకు వచ్చి ఆవిరగబడి నవ్వు లెందుకు? నామొహం ఎదటే అంత అల్లరెందుకు? బీచిషికార్లెందుకూ?"

"బీచిషికారు అతనూ, నేనూ, అతని భార్యా వెళ్లాము. అప్పటి కింకా వాళ్లు సుముఖులు కాలేదు. వాళ్ళిద్దరినీ చెరోవేపున పెట్టుకొని అమాట ఈమాట చెపుతూ నవ్విస్తూండేదాన్ని; క్రమక్రమంగా నన్ను వదిలి వాళ్ళిద్దరూ చెట్టాపట్టాలు వేసుకొని కబుర్లలోకి దిగేదాకాను."

"మరి."

"అతనితో అలాగ విరగబడి మీ మొహంముందు నవ్వడానికి కారణం లేకపోలేదు." అన్నది నాభార్య.

దాచినఉత్తరం తీసుకువచ్చి నాభార్య మీద పడవేసి "ఇదేమిటో చూశావా" అన్నాను.

ఉత్తరం చేత్తో పుచ్చుకుచూచి నాభార్య మళ్లీ నవ్వడం మొదలెట్టింది.

"ఎందు కానవ్వు?" అన్నాను.

"ఎవరు వ్రాశారో ఆ ఉత్తరం చూశారా?" అంది.

"ఎవరో శ్రేయోభిలాషిట!"

"ఆ దస్తూరీ ఎవరిదో?" అన్నది.

"ఏమో, నాకేం తెలుసు?" అన్నాను.

"మళ్లీ ఇంకోమాటు నిదానించి చూడండి" అని నామీదకు ఉత్తరం విసిరింది.

జాగ్రత్తగా దస్తూరీ పరీక్షించి, "ఎవరిదంటావు?" అన్నాను.

"ఎవరిదా? ఇంకోమాటు చూడండి" అన్నది.

"ఎంత మోసం! నీదే ఈ దస్తూరీ! కళ్ళు కప్పుకుపోయేయి నాకు."

"ఇప్పుడు తెలిసిందా?" అన్నది.

"ఏమిటి తెలియడం" అన్నాను.

"ఆవిరగబడి నవ్వడమూ, ఈ ఉత్తరమూ నామీద మీకు అనుమానం కలగడానికే!"

"ఎందుకు అనుమానం కలిగించుకొన్నావు?"

"ఈ యేటిక్లబ్బు బహుమానం కోసం."

"బహుమానం యియ్యడానికి ఏమి చెయ్యాలన్నా రేమిటి?"

"శీలానికి భంగంరాకుండా ఎవరైతే తమభర్తలకు తమ గుణాన్ని గురించి అనుమానం కలిగిస్తారో వారికి బహుమానం."

"నీవొక్కర్తెవేనా ఏమిటి, మీక్లబ్బు కంతకీ అంత ప్రయోజకురాలివి. మై లిటిల్ స్కాండ్రల్?"

"అందరికన్న మార్కులు నాకు ఎక్కువ వచ్చినవి కాబట్టి నాకు బహుమానం వచ్చింది."

"ఎలాగ ఆమార్కులు నిర్ణయించారు?"

"జడ్జీలు గూఢంగా మెంబర్ల తాలూకు భర్తలచర్యలు ఈ రెండు నెలలబట్టీ కనిపెడుతున్నారు. మీ బిక్కమొహం, మీరు క్లబ్బుచుట్టూ తిరగడం, నాతో మాట్లాడక పోవడం— ఇవన్నీ చూచి నేనే నెగ్గానని నిర్ణయించారు."

"ఇలాంటిపనులు చెయ్యడం ప్రమాదం కాదూ? ఎటునుంచి ఎటు వస్తుందో! సంసారాలు చెడిపోవూ."

"ఆ ధైర్య మున్నవాళ్లే యిందులో ప్రవేశించారు. ఈమాత్రం యడ్వెంచర్ సాహసం ఆడవాళ్లకు లేకపోతే ఎందుకు పనికివస్తారు?"

ఈ ప్రశ్న కింక సమాధానం లేదు. నామనస్సులో బెంగ తీరింది. కుదుటబడ్డాను. నిట్టూర్పు విడిచాను.

౫

నాభార్య కాఫీ, బిస్కట్లూ, చోకలేట్లూ తెచ్చి బల్లమీదపెట్టింది. ఇద్దరమూ ఆరగిస్తూ సరదాగా ప్రసంగించుకొన్నాము.

"ఈ బిస్కత్తు ముక్క తిను, మై బ్యూటీ" అన్నాను.

"థేంక్సు, మైసోల్" అని బిస్కట్లు తినడం మొదలుపెట్టింది నాభార్య.

"నువ్వు మీక్లబ్బు కంతటికీ ప్రయోజకురాలవులా గున్నావే! క్రిందటి ఏటిబహుమానం నీదే; యీయేటిదీ నీదే" అన్నాను.

"పియర్ లక్; మీసహాయం లేకపోతే నాకీబహుమతులు వచ్చేవా చెప్పండి మరి."

"అల్లరిపిల్లా! అయితే నీతోకూడా యీయేడు యీపందెంలో ప్రవేశించినవాళ్లసంగతి చెప్పావు కావు" అన్నాను.

"చెప్పనా,—ఒకావిడ తానే తనకు ఎవరో పురుషుడు ప్రేమలేఖ,, వ్రాసినట్లు వ్రాసుకొని ఆకవరు ''. తనచేతి సంచీలో పెట్టిభర్తతో మాట్లాడడానికి వెళ్లింది. మాటలమధ్య కవరు కింద జారవిడిచి వెళ్లిపోయింది. భర్త ఆకవరుతీసి చదువుకొన్నాడు. కొంత సేపైన తరువాత భర్తదగ్గిరికి వచ్చి బిక్కమొహంతో నా ఉత్తరం పడిపోయిం దంది. ఆ ఉత్తరం తనకు దొరికిం దనీ తాను చదివేననీ భర్త చెప్పాడు. ఆవిడ భయం నటించి గడగడ వణికింది. భర్త ఆవిడతో అన్నాట్ట, "ఇదివరలో ఎన్ని ఉత్తరాలు వచ్చాయి నీకు?"

భయపడుతూ, "ఇదే మొదటిది క్షమించండి" అందిట.

"దీనికి సమాధానం రాశా"వా" అని అడిగేట్ట.

సందేహిస్తూ నెమ్మదిగా "రాశా నందిట.

"రాశావా! ఎలా రాశావు మైడియర్ వైఫీ? దీనిలో అడ్రెసు లేదే!" ఆవిడ తెల్లబోయిందట.

"మళ్లీ మీక్లబ్బువాళ్లు మీచేత కోతిచేష్టలు చేయిస్తున్నారా యేమిటి?" అన్నాట్ట నవ్వుతూ. భర్తకు అనుమానం కలిగించలేకపోబట్టి ఆవిడకు బహుమానం లేదు.

ఇంకో ఆవిడుంది మాక్లబ్బులో. ఆవిడకు సిగరెట్టు అలవాటులేదు. ఆసంగతి భర్తకు తెలుసును. ఆమె భర్తకూ సిగరెట్టు అలవాటులేదు. ఒకనాడావిడ భర్త వచ్చేవేళకు రెండుప్యాకెట్ల సిగరెట్లు కుంపటిలో వేసి ఆపొగ ఇల్లంతా చుట్టివేసుకొనేలా చేసింది. ఇంతట్లోకే భర్తవచ్చి తలుపుతట్టాడు. పదినిముషాలదాకా

తలుపు తియ్యలేదు. ఈపాటికి అనుమానం కలిగిఉంటుందిగదా అనుకొని తలుపుతీసి చీరా పైటా సవరించుకోవడం మొదలెట్టింది. భర్త లోపలికి వచ్చాడు. సిగరెట్టు వాసన పీల్చాడు. భార్యతో అన్నాడుగదా, "చెప్పావు కావు; క్లబ్బులో మెంబర్లంతా సిగరెట్లు కాల్చాలని నిబంధన వచ్చిందా ఏమిటి ? అంతసిగ్గూ దాపరికం ఎందుకు? చంపేశావే వీధులో నిలబెట్టి ! ఈమాత్రం కార్యానికి భయ మెందుకు? నీయిష్టమొచ్చినన్ని సిగరెట్లు కాల్చుకో నేనేమీఅనను. రేపు మంచి "నేవీకట్" సిగరెట్లు ఒకడబ్బా తెస్తానుండు." భర్తకు అనుమానం రాలేదుసరిగదా సిగరెట్ల అలవాటు అంటుకొంటుం దని ఆవిడ భర్తతో నిజంచెప్పింది. "ని న్నెప్పుడేనా అనుమానిస్తానా, హసీ?" అన్నా డా భర్త.

" వింటున్నారా " అంది నాభార్య.

" వింటున్నా. " అన్నాను.

" అనుమానించే వాడు గొప్పవాడా అనుమానించనివాడా? "

" న న్నెంచంపుతావు కానిద్దూ. "

" ఆల్ రైట్, డియర్.—

ఇంకోఆవిడ భర్త వీధులో మొహం కడుక్కుంటూవుంటే తానూ ఆసమయానికి వీధిలోకి వచ్చి యెదుటి యింటి పెద్దమనిషిని నిదానించి చూడ్డం మొదలుపెట్టింది. పదిహేను రోజు లిలాగ అయ్యేసరికి ఆపెద్దమనిషి ప్రతీరోజూ వీళ్లింటికి కాఫీకి తయారయ్యేవాడు. భర్త యెదుటే అత న్నెంతోఆదరించి కాఫీఇచ్చేది. ఫలహారాలు పెట్టేది.అతడు యింటికి వస్తే తాను ఎదురుగా వెళ్లి కుశల ప్రశ్న లడిగేది. వెళ్లిపోతూంటే షేక్‌హాండుచేశేది. భర్తకీప్రవర్తన వల్ల ఆవిడమీద ఎటువంటి అనుమానమూ కలగలేదు. క్లబ్బు ఆచారాలు కొత్తగా నేర్చింది కాబోలను కొన్నాడు. కాని ఒకప్రమాదం వచ్చింది. అప్పటినుంచీ ఆపెద్దమనిషి వదల్చుకోవాలన్నా వదలకుండా పట్టుకొన్నాడు. చివరకి వాడిని వదలించుకోవడం బ్రహ్మాండం అయింది"

" ఎలాగ వదిలించు కొన్నారు ? " అన్నాను.

"ఎలాగా? వాణ్ణి ఒకకూలివాడికింద కట్టి. ఆవిడ ఏమిచెపితే ఆ పనులు చేసేవాడు. రోజూ పోష్టులో ఉత్తరాలు వెయ్యడం వాడే, బజారునుంచి కూరలు తేవడం వాడే, తోటలో చెట్లకు గొప్పులు తవ్వడం నీళ్లు పొయ్యడం వాడే, పిల్లల్ని ఎత్తుకొని ఆడించడం వాడే. ఇలాగ పది పదిహేను రోజులు గడిపి విసిగి లేచిపోయాడు. అప్పుడు ఆవిడభర్త ఆవిడతో అన్నాడుగదా, "లేచిపోయే డేం ఆ పెద్దమనిషి? జీతం బత్తెంలేని కూలివాణ్ణి సంపాదించావుగదా అని సంతోషిస్తూంటే."

ఆవిడకు బహుమానం వచ్చేవిధం లేదుగదా. ఇంక మీరు నన్ను అనుమానించారు. అనుమానిస్తే అనుమానించారులెండి. ఇప్పుడు బహుమానం వచ్చింది కాబట్టి బెంగ లేదు. కాని యికముం దెప్పుడూ నన్ననుమానించరుగదా అని మీసం పట్టుకోబోతూంటే అన్నానుగదా—

"అయితే, హసీ; నీబహుమానం ఏమిటో చూపావుకావేమి?"

"ఇందాకటినుంచీ మీకోసం ఎదురుచూస్తోంది—అదిగో ఆ ట్రంకు."

"ఏమిటీ? ఆ ట్రంకా; దాల్లోఏమైనా ఉందా? వుత్తిట్రంకేనా"

"తీసి చూడండి."

ట్రంకుతాళం తీసి మూత ఎత్తి చూశాను. అందులో ఒకపట్టుచీరా, ఒకడజను బ్లౌసులూ, ఒకడజను పెసరీలూ ఉన్నాయి.

"ఇవి ఆడవాళ్లసరుకు ముట్టుకోకూడదుకాబోలు" అన్నాను.

"కూడకపోతే మాంతారా? మీరు ముట్టుకోకుండానే జరుగుతుందా?" అంది.

"అయినా నాకెందుకు? నీబహుమానాల సంగతి " అన్నాను.

"మీకుమాత్రం గాకేమి? మనం పంచుకొంబాం వాటిని" అంది.

"ఎవరు పంపకం వెయ్యడం " అన్నాను.

"నేవేతునా" అని చీరా, బ్లౌసులూ నావళ్లోపెట్టి పారిపోబోయింది. పట్టుకొని చెవులో చెప్పానుగదా.

"అవిమాత్రం మిగుల్చుకొంటా వెందుకు— ఆ పెసరీలు— అవీ నాకే యియ్యి."

నాభార్య నవ్వుతూ నన్ను లెంపమీద వాయించి చీరా బ్లౌసులూ తీసుకుపోయి బీరువాలో పెట్టుకొంది.

"ఈట్రంకుకూడాతీసికెళ్లు"అన్నాను.

"మైడియర్ హబ్బీ!ఆట్రంకుమీది."

"థాంక్సు మైలిటిల్ మాసీ."